

నేడు పారాబోలా-9 స్టార్టప్ సెంటర్ ప్రారంభం

నూజివీడు టౌన్ : నూజివీడు ఆర్‌జియుకెటి క్యాంపస్‌లో స్టార్టప్ సెంటర్‌ను స్థాపించాలనే ఉద్దేశంతో 2024 అక్టోబర్‌లో యుఎస్‌ఎ - ఆధారిత సంస్థ అయిన పారాబోలా-9తో అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ సంస్థ నూజివీడు క్యాంపస్‌ని సందర్శించి, హ్యాకథాన్‌ను నిర్వహించింది. ఇ 4 నుంచి 15 మంది ఫుల్ టైం ఇంటర్న్‌లను నియమించింది. అలాగే ఇ 2, ఇ 3 నుంచి ఎనిమిది మంది పార్ట్‌టైమ్ ఇంటర్న్‌లు సాయంత్రం రెండు గంటలపాటు సహాయ సహకారాలు అందిస్తారు. నూజివీడు ఆర్‌జియుకెటి క్యాంపస్ నిర్దేశకులు ఆచార్య ఎస్.అమరేంద్రకుమార్ ఆదేశాల మేరకు నూజివీడు క్యాంపస్ పరిపాలన విభాగం ఈ కేంద్రాన్ని స్థాపించడానికి కావాల్సిన స్థలాన్ని కేటాయించి తమ మద్దతును అందించారు. పారాబోలా-9 తమ కేంద్రాన్ని ఐ - 3 భవనంలోని మొదటి అంతస్తులో విజయవంతంగా ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాన్ని ఈ నెల ఆరో తేదీ శుక్రవారం ఉదయం పది గంటలకు ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి హాజరు కానున్నారు.

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక

పోలింగ్ ప్రశాంతం



ఏలూరులో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పశ్చిమలో 93.27 శాతం, ఏలూరు జిల్లాలో 91.60 శాతం ఓటింగ్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్లు వెట్రిసెల్వి, నాగరాణి

కాకినాడ తరలిన బ్యాలెట్ బాక్సులు

ప్రజాశక్తి - భీమవరం

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక పోలింగ్ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రశాంతంగా ముగిసింది. రెండు జిల్లాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోలేదు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ 11 గంటల నుంచి ఊపందుకుంది. మధ్యాహ్నం 12 గంటలకు రెండు జిల్లాల్లో 50 శాతానికిపైగా పోలింగ్ శాతం నమోదైంది. ఏలూరు జిల్లాలో 20, పశ్చిమలో 20 మొత్తం 40 కేంద్రాల్లో పోలింగ్ సాగింది. రెండు జిల్లాల్లోని ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటహక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు ఏలూరు జిల్లాలో 2,667 మంది, పశ్చిమలో 3,729 మంది ఉన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించారు. ఓటుహక్కు వినియోగించుకునే ప్రభుత్వ ఉపాధ్యాయ ఓటర్లకు ప్రత్యేక సెలవును విద్యాశాఖ మంజూరు చేసింది. ఏలూరు జిల్లాలో 2,667 మంది ఓటర్లకుగాను 2,443 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 1387 మంది పురుషులు, 1056 మంది మహిళలు ఉన్నారు. జిల్లాలో సాయంత్రం నాలుగు గంటల వరకు 91.60 శాతం పోలింగ్ నమోదైనట్లు ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రకటించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 3724 మంది ఓటర్లకుగాను 3,478 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసేసరికి 93.27 శాతం పోలింగ్ నమోదైంది. వీరవాసరం ఎంఆర్‌కె హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు. ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, చాటపర్రు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరిశీలించారు. భీమవరంలోని బాపిరాజు హైస్కూల్, కాళ్లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. మహిళా ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఓటు వేసేందుకు తరలొచ్చారు.

ఉభయగోదావరి జిల్లాల్లో గోపీమూర్తి సుడిగాలి పర్యటన

పిడిఎఫ్ అభ్యర్థి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపీమూర్తి ఉభయగోదావరి జిల్లాల్లో సుడిగాలి పర్యటించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, ఉండి, గణపవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు జిల్లాలోని నిడమర్రు, ఏలూరు, భీమడోలు, తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి, నల్లజర్ల, దేవరపల్లి, కొవ్వూరు, రాజమండ్రి వన్‌లో రెండు, టూటౌన్‌లో మరో రెండు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఆధ్యాపకులు పెద్దఎత్తున ఆదరించి ఓట్లు వేశారని కృతజ్ఞతలు తెలిపారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకుల పక్షాన నిలబడతారనేది మరోసారి రుజువవుతుందన్నారు. తాను మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే గెలుపొందే అవకాశాలున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి

మొదటి ఓటుతోనే గోపీమూర్తి గెలుపు ఖాయం

ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి)

మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి గెలుపు ఖాయమని గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. భీమవరంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటర్లంతా ఉత్సాహంగా పోలింగ్ పాల్గొని ఓటు వేశారన్నారు. జూనియర్ కళాశాలలు, కాంట్రాక్ట్ అధ్యాపకులు, అన్ని గురుకులాల వృత్తి సంఘాలు, సిఐటియు సంఘాల్లో బలంగా ఉన్నామని అందుకే మాది వృత్తి, వర్గ బంధమని, వందల సంఘాల బలం, ఓట్లున్నవారే కాకుండా లేని వారి బలం కూడా తమకుందని చెప్పారు. నూటికి నూరు శాతం గెలుపు తమదేనని స్పష్టం చేశారు.

ఓట్లు అభ్యర్థించిన ప్రజాసంఘాలు

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తికి ఓటు వేయాలని కోరుతూ పలు సంఘాల నేతలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓట్లు అభ్యర్థించారు. భీమవరంలో బాపిరాజు హైస్కూల్ సమీపాన ఏర్పాటు చేసిన శిబిరం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, ప్రజాసంఘాల నేతలు ఆంజనేయులు, వైకుంఠరావు, ఇంజేటి శ్రీనివాస్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ధనుష్, ఇతర నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసన పోలింగ్.. తెరుచుకున్న మద్యం దుకాణాలు


ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే జిల్లాలో అన్ని మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. పోలింగ్ నేపథ్యంలో ఈ నెల మూడో తేదీ మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలను మూసివేశారు. 48 గంటలపాటు మద్యం దుకాణాలు మూసేసినప్పటికీ బెల్ట్‌షాపుల ద్వారా మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయి. దీనిపై ఎక్సైజ్ అధికారులు నామమాత్రపు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

9న ఓట్ల లెక్కింపు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అందరి దృష్టి ఓట్ల లెక్కింపు, గెలుపోటములపై పడింది. బ్యాలెట్ బాక్సులను ఆయా జిల్లా కేంద్రాలకు తరలించి, అక్కడి నుంచి పటిష్టభద్రత నడుమ రాత్రికి కాకినాడలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. ఈ నెల తొమ్మిదో తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. కాకినాడ జెఎన్‌టియులో కౌంటింగ్ పూర్తయిన అనంతరం ఫలితాలు ప్రకటించనున్నారు.

ఏలూరు జిల్లా పోలింగ్ సరళి

ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగింది. ఉదయం 10 గంటల వరకు 15.52 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 12 గంటలకు 47.62 శాతం, మధ్యాహ్నం రెండు గంటలకు 74.58 శాతం, మధ్యాహ్నం 4 గంటలకు 91.60 శాతం పోలింగ్ నమోదైంది.



భీమవరంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి



చింతలపూడి : ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉపాధ్యాయ ఓటర్

91.60 శాతం పోలింగ్ నమోదు

పలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. గురువారం ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చాటపర్రు హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,667 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారిలో 2,443 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని, వీరిలో 1387 మంది పురుషులు, 1056 మంది మహిళలు ఉన్నారని అన్నారు. జిల్లాలో సాయంత్రం నాలుగు గంటల వరకు 91.60 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. ఓటింగ్ సరళిని పర్యవేక్షించేందుకు ఏలూరు కలెక్టరేట్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. బ్యాలెట్ బాక్స్‌లకు వేసిన సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఎన్నికల అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. కలెక్టర్ వెంట ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ తదితరులు ఉన్నారు.

కుక్కునూరు: మండలంలో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ సంపూర్ణంగా జరిగింది. ఆరు ఓట్లకు అన్నీ పోలయ్యాయి.

వేలేరుపాడు: మండలంలో 11 మంది ఓటర్లకుగాను పది మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఉంగుటూరు: స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్ ఆధ్వర్యంలో చేబ్రోలు ఎస్‌ఐ ఎం.సూర్యభగవాన్ బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా వై.పూర్ణచంద్రప్రసాద్ వ్యవహరించారు.

జీలుగుమిల్లి: జీలుగుమిల్లి జెడ్‌పి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇక్కడ 67 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద పిడిఎఫ్ శిబిరాన్ని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా అలీ, జిల్లా కార్యదర్శి కమల్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పెదపాడు: పెదపాడు హైస్కూల్‌లో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగింది. మొత్తం 72 మంది ఓటర్లకుగాను 65 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

చింతలపూడి: చింతలపూడి, లింగపాలెం మండలాల్లో ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చింతలపూడిలో 232 మంది ఓటర్లకుగాను 215 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. లింగపాలెంలో 48 మంది ఓటర్లకుగాను 46 ఓట్లు పోలయ్యాయి.

టి.నరసాపురం: మండలంలో మొత్తం 35 మంది ఓటర్లకుగాను 32 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగిలిన ముగ్గురిలో ఇద్దరు ఓటు వేయకపోగా, మరొకరు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

ఏలూరు సిటీ: ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఏలూరులోని కోటదిబ్బ వద్ద గల డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 896 ఓట్లకుగాను 804 ఓట్లు పోలయ్యాయి. పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి ఈ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం గోపీమూర్తి మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే తాను గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ద్వారకాతిరుమల: ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌లో 69 మంది ఓటర్లకుగాను 63 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని పోలింగ్ ఆఫీసర్ జెవి.సుబ్బారావు తెలిపారు.

కొయ్యలగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ కేంద్రంలో 107 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 113 మంది ఓటర్లకుగాను ఆరుగురు ఓటేయలేదు. పోలింగ్ కేంద్రాన్ని ఆర్‌డిఒ ఎంవి.రమణ సందర్శించారు. ప్రిసైడింగ్ అధికారి, తహశీల్దార్ కుంజా చల్లన్న దొర, ఎస్‌ఐ చంద్రశేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పోలవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 103 మంది ఓటర్లకుగాను 94 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 90 శాతం ఓటింగ్ నమోదైంది. పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, సిఐ బాల సురేష్‌బాబు, ఎస్‌ఐ పవన్ కుమార్ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఏడు పోలింగ్ కేంద్రాలున్నాయని, 300 మంది పోలీసు సిబ్బంది, స్థానిక సిఐలు, ఎస్‌ఐలు బందోబస్తు నిర్వహించారన్నారు.



జీలుగుమిల్లి : పోలీస్ బందోబస్తు

దెందులూరు: ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో మొత్తం 230 మంది ఓటర్లుండగా, వారిలో 210 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు 91.73 శాతం పోలింగ్ నమోదైంది. పెదవేగి మండలంలో మొత్తం 65 మంది ఓటర్లుండగా 64 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 98.46 శాతం పోలింగ్ నమోదైందని పిఒ భ్రమరాంబ తెలిపారు. ఏలూరు రూరల్ మండలంలో మొత్తం 16 మంది ఓటర్లు ఉండగా 15 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో 93.75 శాతం పోలింగ్ నమోదైందని పిఒ అంతర్వేది శ్రీనివాస్ తెలిపారు. దెందులూరు మండలంలో మొత్తం 77 ఓట్లకుగాను 67 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 87.01 శాతం పోలింగ్ నమోదైందని పిఒ శ్రీదేవి తెలిపారు. పెదపాడు మండలంలో మొత్తం 72 ఓటర్లకుగాను 65 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 90 శాతం పోలింగ్ నమోదైందని పిఒ కృష్ణజ్యోతి తెలిపారు.

బుట్టాయగూడెం: మండలంలో ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎన్నికల నిర్వహణ అధికారి, స్థానిక తహశీల్దార్ చలపతిరావు మాట్లాడుతూ మండలంలో 339 మంది ఓటర్లకుగాను 302 మంది ఉపాధ్యాయుల తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. 37 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదని తెలిపారు.

టీచర్‌గా మారిన కలెక్టర్

పవర్‌పేట ఎంసియుపి స్కూల్‌లో తనిఖీలు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి మెరుగుపడుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక పవర్‌పేటలోని ఎంసియుపి స్కూల్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులను ఇంగ్లీష్, గణితంలో ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, విద్యార్థులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి పాఠశాలలోని మూడో పిల్లలతో మమేకమై కొంతసేపు ఉపాధ్యాయురాలిగా మారిపోయారు. విద్యార్థులకు పాఠాలు చెప్పారు. వారితో సరదాగా గడిపారు. బ్లాక్ బోర్డుపై ఇంగ్లీష్ పదాలు ఇచ్చి వాటిని కరెక్ట్‌గా పలకమన్నారు. అనంతరం గణితం సబ్జెక్టులో కొన్ని లెక్కలు ఇచ్చి వాటిని పరిష్కరించామన్నారు. వెంటనే విద్యార్థులు తాము చెబుతామంటే... తాము చెబుతామని.. పోటాపోటీగా వచ్చి ఇంగ్లీష్ పదాలు పలికారు. గణితంలో ఇచ్చిన హెచ్చివేతలు, భాగాహారాలను కూడా విద్యార్థులు వెంటనే పరిష్కరించే సరికి కలెక్టర్ ఆశ్చర్యపోయి ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు నాణ్యతతో కూడిన విద్యాబోధన చేస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో అటువంటి బాధ్యత ఉంటుందన్నారు. అటువంటి ఉపాధ్యాయులను తాను ఎప్పుడూ ప్రోత్సహిస్తానని, అదే సమయంలో అలసత్వంతో ఉండే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటానన్నారు. తాను జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనే క్రమంలో ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఎక్కడైనా ఉపాధ్యాయులతో అలసత్వం, మధ్యాహ్న భోజన నాణ్యతలో లోపాలు ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటానని తెలిపారు. కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యా శాఖాధికారి వెంకట లక్ష్మమ్మ, నగరపాలక సంస్థ ఉప కమిషనర్ చంద్రయ్య, ఎంఇఒలు రంగారావు, రవిప్రకాష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీహరి ఉన్నారు.

వంటలూ మాతోనే చేయిస్తున్నారు..!

అనారోగ్యంగా ఉన్నా పట్టించుకోవడంలేదు

గిరిజన గురుకుల ఏకలవ్య పాఠశాల విద్యార్థుల ఆవేదన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని ఇప్పలపాడులో ఉన్న గిరిజన గురుకుల ఏకలవ్య పాఠశాల విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం చేసిన వంటలను సాయంత్రం పెడుతున్నారని, సాయంత్రం చేసిన వంటలను మరుసటి రోజు పెడుతున్నారని, ఒక్కోసారి వంట చేసేందుకు కూడా తామే సాయం చేయాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. ఈ నెల మూడో తేదీన వ్యాయామ ఉపాధ్యాయురాలు అనారోగ్యంతో ఉన్న ఎనిమిదో తరగతి విద్యార్థిని కుర్ల హేమలతతో వ్యాయామం చేయించడంతో ఆ విద్యార్థిని సొమ్మసిల్లి కింద పడిపోయింది. దీంతో ఆ విద్యార్థిని బుట్టాయగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని గురువారం మాట్లాడుతూ తమను పాఠశాలలో సక్రమంగా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తన లాంటి విద్యార్థులు ఏడో తరగతి నుంచి ఫస్టియర్ వరకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉదయం చేసిన వంటలను సాయంత్రం పెడుతున్నారని, సాయంత్రం చేసిన వంటలను మరుసటి రోజు పెడుతున్నారని తెలిపింది. ఒక్కోరోజు వంటలు చేయడానికి కూడా తామే సాయం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. అనారోగ్యానికి గురైన విద్యార్థులను చాలా చులకనగా చూడడమే కాకుండా వారికి కనీసం వైద్యం చేయించడం లేదని వాపోయింది. తనకు మలేరియా, టైఫాయిడ్ జ్వరం కారణంగా నీరసంగా ఉన్నా కూడా వ్యాయామం చేయించారని, దీంతో కాళ్ల నొప్పులతో సొమ్మసిల్లి పడిపోయానని తెలిపింది. వసతి గృహ వార్డెన్లు లేరని, పట్టించుకునే నాధుడే కరువయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వాపోతున్నారు. సమస్యలను పట్టించుకోని ప్రిన్సిపల్‌ను, అనారోగ్యంగా ఉన్నా వ్యాయామం చేయించిన వ్యాయామ ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఏకలవ్య పాఠశాలలో ఐటిడిఎ అధికారులు సరైన సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.




ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

మెరుగైన సేవలందించేందుకు కృషి

ఆర్‌టిసి రీజనల్ బోర్డు ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆర్‌టిసి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు, బస్టాండ్ ప్రాంగణాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎపిఎస్‌ఆర్‌టిసి విజయవాడ రీజనల్ బోర్డు ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. తొలుత ఏలూరు కొత్త బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న సదుపాయాల గురించి ప్రజారవాణా శాఖాధికారి వరప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ప్రజా రవాణా శాఖాధికారి కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ సంక్రాంతికి, శివరాత్రి తదితర పండుగలకు ఆర్‌టిసి బస్సుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు రవాణా అంశంలో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలనేది తమ లక్ష్యమన్నారు. జిల్లాలోని జంగారెడ్డిగూడెం, నూజివీడు, ఏలూరు డిపోల నుంచి తిరుమల తిరుపతికి, వాడపల్లికి ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆర్‌టిసిలో రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌టిసిలో 16 వేల మంది డ్రైవర్, కండక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ వాణి పాల్గొన్నారు.



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న రెడ్డి అప్పలనాయుడు


నాణ్యమైన గోనె సంచులివ్వండి

తేమశాతం లెక్కింపులో తేడాలు అరికట్టండి

చిరిగిన గోనె సంచులతో రైతుసంఘం ఆధ్వర్యాన రైతుల నిరసన

ప్రజాశక్తి - పెదపాడు

ధాన్యం సేకరణకు రైతులకు నాణ్యమైన గోనె సంచులు ఇవ్వాలని, తేమ శాతం లెక్కింపులో తేడాలు అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. గురువారం మండలంలోని కొత్తూరు, కొత్తముప్పరు, పెదపాడు గ్రామాల్లో రైతు నేతలు పర్యటించి కల్లాల్లోని ధాన్యాన్ని పరిశీలించారు. కొత్తూరులో రైతుసంఘం ఆధ్వర్యంలో చిరిగిన గోనె సంచులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుసేవా కేంద్రంలో లెక్కించిన తేమ శాతానికి, రైస్‌మిల్లు వద్ద లెక్కించిన తేమ శాతానికి 3 నుండి 5 శాతం వరకు తేడా ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. కొన్నిచోట్ల మిల్లర్లు అధిక తేమశాతం చూపి రైతులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. రైతుసేవా కేంద్రంలో నిర్ణయించిన తేమశాతం ఆధారంగా రైస్‌మిల్లులో ధాన్యం అన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. రైతుసేవా కేంద్రాలు ఇస్తున్న గోనె సంచుల్లో నాణ్యత లేదన్నారు. చిరిగిన గోనె సంచులు ఇవ్వడం వల్ల ధాన్యం నేలపాలై అన్నదాతలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన గోనె సంచులు అందించాలని కోరారు. అధికారులు, ప్రభుత్వం హెచ్చరికలు చేస్తున్నా ధాన్యం కొనుగోలులో రైతులు, కౌలురైతులు మోసాలకు గురికాక తప్పడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిల్లగోళ్ల సాయి, బొడ్డు గోవిందరావు, పెద్దిబోయిన సుధాకర్, తంగెళ్ల సాంబశివరావు, పిల్లగోళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.



చిరిగిన గోనెసంచులతో రైతు సంఘం నేతలు, రైతుల నిరసన



తడిచిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

రైతులను వీడని తుపాన్ కష్టాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులను తుపాను కష్టాలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. మండలంలో వర్షాలు తరచూ పడుతూ ఈదురుగాలులు ఇస్తుండడంతో సార్వా వరి పంటకు భారీ నష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు మండలంలోని అనేక గ్రామాల్లో వరి పైరు నేల కొరిగింది. తరచూ వర్షం పడటంతో నీటిలో పైరు మునిగిపోయి గింజ నాని పలు గ్రామాల్లో మొక్క వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. బుధవారం కురిసిన భారీ వర్షంతో మండలంలో నేలకొరిగిన వరి పైరుకు భారీగా నష్టం వాటిల్లింది. మండలవ్యాప్తంగా సుమారుగా నాలుగు వేల ఎకరాల్లో పైరు నేలమట్టమైందని రైతులు చెబుతున్నారు. నేలకొరిగిన పైరును రైతులు నిలబెట్టి కట్టలు కడుతున్నారు. మరి కొందరు కూలీలతో కోతలు కోయిస్తున్నారు. గురువారం వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరదాలపై ఆరబెడుతూ తేమ శాతం తగ్గించే చర్యలు చేపట్టారు. మరికొందరు రైతులు ధాన్యాన్ని సంచుల్లో నింపి రైతు సేవా కేంద్రాలకు, మిల్లులకు ట్రాక్టర్లు, లారీలపై తరలిస్తున్నారు. వాతావరణం ఏ రోజు ఎలా ఉంటుందో అర్థం కాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. చేతికొచ్చిన పంట తుపాన్ ప్రభావంతో చేజారిపోతుందని రైతులు దిగాలు చెందుతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టామని, కనీసం ఖర్చులు వస్తాయా రాదో తెలియని పరిస్థితిలో ఉన్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. తేమ శాతం నిబంధనలు సడలించి రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులను తుపాన్ కష్టాల నుంచి గట్టెక్కించాలని మండల రైతాంగం ప్రభుత్వాన్ని కోరుతుంది.



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కడప ఘటనపై ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - ముసునూరు

కడప జిల్లా రాయచోటి మండలం కొత్తపల్లి ఉర్దూ పాఠశాలలో చోటు చేసుకున్న ఘటన అన్యాయమని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుడిమళ్ల రాంబాబు అన్నారు. మండలంలోని చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కడప జిల్లా రాయచోటి మండలం కొత్తపల్లి ఉర్దూ పాఠశాలలో తరగతి గదిలో కొంతమంది విద్యార్థులు ఘర్షణ పడుతుండగా ఏయాజ్ అహ్మద్ అనే ఉపాధ్యాయుడు అది తప్పని వారించినందుకు కొంతమంది విద్యార్థులు ఆయనపై దాడి చేసి తన మరణానికే కారకులయ్యారన్నారు. ఈ ఘటనకు వ్యతిరేకంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెక్కపల్లి ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఉపాధ్యాయుల రక్షణ కోసం ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మరణించిన ఉపాధ్యాయ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అబ్బాస్, సీనియర్ ఉపాధ్యాయులు రాజశేఖర్, కళాధర్, పద్మావతి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

765 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - ఉంగుటూరు



ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం

ఎలక్షన్ కోడ్ కారణంగా సీల్ వేసిన షాపు పక్కనే అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 765 సీసాలను మంగళగిరి నుంచి వచ్చిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం బుధవారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. ఎస్‌పిఎల్ బృందంలో సిఐ, ఎస్ఐ ఇద్దరూ కానిస్టేబుల్స్ ఉన్నారు. పక్కా సమాచారంతో ఈ బృందం సోదాలు చేయగా బీర్లు, ఇతర బ్రాండ్ల మద్యం సీసాలు ఉన్న కేసులను సీజ్ చేసి వాటిని వెంట తీసుకెళ్లారు. మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎక్కడో మంగళగిరి నుంచి టాస్క్ ఫోర్స్ బృందం వచ్చి రైడ్ చేస్తే గాని స్థానిక అధికారులకు చలనం లేదు. కాగా ఇంత భారీస్థాయిలో మద్యం బాటిల్ బయటికి వచ్చాయంటే స్థానిక అధికారుల పాత్ర ఉందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కనీసం దాడి చేసిన అధికారుల ఫోన్ నెంబర్లు కూడా స్థానిక అధికారులు చెప్పడం లేదు. ఒక్కడే అన్ని కేసుల మద్యం బాటిళ్లను బయటకు తీసుకురాగలడా? షాపు ఓనర్‌కు తెలియకుండా ఇదంతా జరుగుతుందా? షాపు నిర్వాహకులను కాపాడేలా ఎందుకు చేస్తున్నారు...? అంటే ఈ మద్యం అమ్మకాల్లో అధికారులకు వాటా కూడా ఉందా అనే సందేహం కూడా స్థానికుల్లో వ్యక్తమవుతుంది. బెల్ట్ అమ్మితే తోలు తీస్తామని హెచ్చరిస్తున్న సిఎం ఇప్పుడు ఎలక్షన్ కోడ్‌లోనే ఇంత భారీగా మద్యం పట్టుబడితే ఏం చర్యలు తీసుకుంటారు... భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఉండాలంటే షాపు లైసెన్స్ రద్దు చేయాలని పలువురు కోరుతున్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు


ప్రజాశక్తి - టి.నరసాపురం

మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్న భర్తపై, అతని కుటుంబీకులు మొత్తం ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గండిగూడెం గ్రామానికి చెందిన నల్లిబోయిన వాణికి, ముసునూరు మండలం సూర్యపల్లి గ్రామానికి చెందిన నల్లిబోయిన నాగరాజుకు 2014లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో గతేడాదిగా భర్త నాగరాజు రోజు మద్యం తాగి వచ్చి కొడుతూ తిడుతూ శారీరకంగా, మానసికంగా కుటుంబీకులతో కలిసి తనను వేధిస్తున్నాడని, పెళ్లి సమయంలో రూ.పది లక్షలు, పది కాసుల బంగారం, ఎకరం పొలం కట్నంగా ఇచ్చామని, అయిన అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని వాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ దుకాణంలో తనిఖీలు

డీలర్‌పై కేసు

ప్రజాశక్తి - ముసునూరు



రేషన్ దుకాణంలో అధికారులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత బియ్యం, పంచదార, కందిపప్పు నిల్వ చేసినా, అధిక ధరలకు అమ్మినా కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా విజిలెన్స్ అధికారి కన్యాకుమారి చెప్పారు. మండలంలోని కాట్రేని పాడులో రేషన్ షాపులో విజిలెన్స్ వారితో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో షాపులో 50 కేజీల పంచదార, వంద కేజీల కందిపప్పు అధికంగా ఉండటంతో సదరు డీలర్‌పై 6ఎ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారి కన్యాకుమారి తెలిపారు. ఈ దాడుల్లో నూజివీడు డివిజన్ పౌర సంబంధాల శాఖ అధికారి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల ఆరో తేదీన ఏలూరు ఒకటో పట్టణ పరిధిలోని కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమయంలో కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలోని కోటదిబ్బ, మెయిన్ బజార్, పాండురంగ థియేటర్, అగ్రహారం, మార్కెట్, కెనాల్ రోడ్, సత్యనారాయణపేట, లంబాడిపేట, వెన్నవల్లివారిపేట, భావిశెట్టి వారి పేట, నల్ల దిబ్బ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని అంబేద్కర్ కోరారు.

పెదవేగి సెక్షన్ పరిధిలో 33/11 కెవి పెదవేగి సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల ఆరో తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సబ్‌స్టేషన్ పరిధిలోని పెదవేగి, లక్ష్మీపురం, గార్లమడుగు, సీతారామపురం, కవ్వగుంట, ఎంఆర్‌సి కాలనీ, సూర్యారావుపేట పరిసర ప్రాంతాలకు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు, వ్యవసాయ రైతులు గమనించి సహకరించాలని పేర్కొన్నారు.

7న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ వారు ప్రతిష్టాత్మకంగా ఈ నెల ఏడో తేదీన నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్ సమావేశానికి మండలంలోని 16 గ్రామాల్లోని 62 పాఠశాలల్లో ఏర్పాట్లు చేసినట్లు ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు తెలిపారు. మండల కేంద్రమైన విద్యాశాఖ కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పాఠశాలలో 13 కమిటీలను విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహణ గురించి మండలంలోని అందరు ప్రధానోపాధ్యాయులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులందరికీ హోలీ స్టిక్ ప్రోగ్రెస్ కార్డులు సిద్ధం చేయాలని, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ కార్డులు మంజూరు చేసి ఆరోజు ఇవ్వాలని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని తల్లిదండ్రులకు తెలియజేయాలని చెప్పారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : సిఐ

ప్రజాశక్తి - ముదినేపల్లి

వ్యాపారులు, ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కైకలూరు రూరల్ సిఐ వి.రవికుమార్ అన్నారు. మండలంలోని సింగరాయపాలెంలో సీసీ కెమెరాల ఉపయోగం గురించి వ్యాపారులకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. సింగరాయపాలెంలో శనివారం నుంచి జరగనున్న షష్ఠి ఉత్సవాల సందర్భంగా వేలాదిగా భక్తులు రానున్న నేపథ్యంలో చోరీల నివారణకు వ్యాపారులకు సీసీ కెమెరాల ఉపయోగం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి ఎస్ఐ విఎస్.వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై జరిమానాలు విధిస్తున్నట్లు ఆర్‌టిఒ లాల్ అన్నపూర్ణజామిర్ తెలిపారు. పట్టణంలో పాతబస్టాండ్, ఫైర్ స్టేషన్ వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటించని స్కూల్ బస్సులకు జరిమానాలు విధిస్తున్నామని, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేసే వారికి భారీ జరిమానా విధిస్తామని తెలిపారు.

ప్రాధాన్యతా క్రమంలో ప్రజా సమస్యల పరిష్కారం

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజా సమస్యలకు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారాలు చూపుతున్నామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు పవర్‌పేటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం వినతులందించేందుకు ప్రజలు వచ్చారు. తనను కలవడానికి వచ్చిన వారికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పలు సంఘాల నాయకుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ప్రజా సమస్యలకు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారమార్గాలు చూపుతూ వస్తున్నామన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకు రావచ్చని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు శ్రీను పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవ కమిటీ నియామకం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి కళ్యాణ మహోత్సవాలకు ఉత్సవ కమిటీ ఏర్పాటైంది. ఈ నెల ఆరో తేదీ నుంచి 18వ తేదీ వరకు షష్ఠి కళ్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు దేవదాయ ధర్మదాయ శాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా బొంగు రవికుమార్, వెనిగళ్ల సురేష్, శీలం శివరమేష్, పరసా కృష్ణ, బూరుబోయిన సోవమ్మ, కొట్టి సుబ్బలక్ష్మి, దగాని నాగలక్ష్మి, బెజవాడ నాగ వెంకట రాధాకృష్ణ, పరసా రమేష్‌లను నియమించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి గురువారం తెలిపారు.

జనసేనలో చేరిక

ఏలూరు సిటీ: ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గతంలో చేసిన పోరాటాలు, ఇప్పుడు డిప్యూటీ సిఎం అయిన తర్వాత ప్రజల పక్షంలో తీసుకుంటున్న నిర్ణయాలను చూసి ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి ప్రజలు జనసేనలో చేరుతున్నారని ఆర్‌టిసి విజయవాడ రీజినల్ బోర్డ్ ఛైర్మన్ రెడ్డిఅప్పలనాయుడు అన్నారు. ఏలూరులోని జనసేన పార్టీ కార్యాలయం గురువారం వివిధ పార్టీల నుంచి జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ షేక్ ఫరీద్ ఖాసిం ఆధ్వర్యంలో 20 మంది జనసేనలో చేరారని చెప్పారు.

అంగన్‌వాడీ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు



అంగన్‌వాడీ కేంద్రంలో కలెక్టర్ వెట్రిసెల్వి

అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక పవర్‌పేట బులుసువారివీధిలోని 32వ నెంబర్ అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలు అక్షరాలు సరిగ్గా పలకలేకపోవడంతో అంగన్వాడీ కేంద్రం సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు, పిల్లలకు ప్రీ స్కూల్‌గా కూడా ఉండాలన్నారు. అంగన్వాడీకి వచ్చే చిన్నపిల్లలకు ఆటలు, పాటలు, మాటలు, చిన్న చిన్న పదాలు, నేర్పడంతోపాటు పిల్లల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందే విధంగా వివిధ కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లే సమయానికి విద్య పట్ల ఆసక్తి పెంపొందేలా అంగన్వాడీ సిబ్బంది పని చేయాలన్నారు. ఈ అంశాలపై ఐసిడిఎస్ ప్రత్యేక కార్యక్రమాలను నిర్దేశించిందన్నారు. సదరు ప్రణాళిక ప్రకారం వాటిని అంగన్వాడీ సిబ్బంది తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేయాల్సి ఉందన్నారు. ఇక నుంచి సిబ్బంది ఆ దిశగా పని చేయాలని కలెక్టర్ అంగన్వాడీ సిబ్బందిని ఆదేశించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మౌనిక, అంగన్వాడీ సహాయకులు మణి పాల్గొన్నారు.

పలుచోట్ల ప్రపంచ నేల దినోత్సవం

ప్రజాశక్తి - ముదినేపల్లి

నేలలు ఆరోగ్యంగా ఉంటేనే పైరు బాగా పండుతుందని ఎడిఎ జి.వెంకటమణి అన్నారు. ప్రపంచ నేలల దినోత్సవ మండల స్థాయి అవగాహన సమావేశం గురువారం మండలంలోని వడాలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటమణి మాట్లాడుతూ నేలల ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ తమ భూముల్లో తొలకరిలో పచ్చరొట్ట పైర్లు సాగు చేసుకుని కలియదున్ని తద్వారా నేల సారాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ మాట్లాడుతూ రైతులందరూ విధిగా తమ భూముల సారాన్ని తెలుసుకునేందుకు భూసార పరీక్షలు చేయించుకోవాల్సిందిగా కోరారు. భూసార పరీక్ష ఫలితాల కార్డులను, అందులోని సిఫార్సులను అనుసరించి రైతులు పంటకు వేయాల్సిన ఎరువుల మోతాదును నిర్ణయించుకోవాలని తెలిపారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష ఫలితాల కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని తుక్కులూరు గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రకృతి నేల దినోత్సవం సందర్భంగా నేలను ఎలా సంరక్షించుకోవాలి, జీవత్వం క్షీణించిన నేలను ఎలా పునరుద్ధరించుకోవాలి, ప్రకృతి వ్యవసాయం ఉపయోగాలు, సేంద్రియ వ్యవసాయ సాగులో తీసుకోవాల్సిన సిద్ధ పద్ధతులను వివరించారు. అనంతరం తుక్కులూరు గ్రామంలో రైతు క్షేత్రంలో నేల పరీక్షకు మట్టి నమూనాలు ఎలా సేకరించాలనే పద్ధతిని రైతు క్షేత్రంలో రైతులకు నేరుగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ అధికార టెక్నీషియన్ ఎం.సూరి, వ్యవసాయ గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పేదలకు స్థలాలివ్వాలని సిపిఎం వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలు, రీ సర్వే జరిగిన గ్రామాల్లోని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు వెంటనే మంజూరు చేయాలని సిపిఎం ఆగిరిపల్లి మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆగిరిపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, నివేశన స్థలాలు లేక ఒకొక్క ఇంట్లో రెండు మూడు కుటుంబాలు నివశిస్తూ పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతుల భూములకు సంబంధించి పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు కాకపోవడంతో రుణాలు పొందేందుకు రైతులు పలు అవస్థలు పడుతున్నారని ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ జి.పవన్‌కుమార్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఏపూరి రవీంద్ర, గంటా పాపారావు, షేక్ జహంగీర్ బాషా, సత్తు కోటేశ్వరరావు, జలసూత్రం గోపాలరావు, ఎడ్వర్డ్, శివమాణిక్యం, శిరీష, సామ్రాజ్యం, నాగూర, లక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి పనులు 200 రోజులు కల్పించాలి

ఎంపిడిఒ కార్యాలయం వద్ద వ్యకాస ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



ఎఒ అబ్దుల్‌సలాంకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

ఉపాధి హామీ చట్టం పని దినాలు 200 రోజులకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆగిరిపల్లి మండల కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గురువారం ఆగిరిపల్లి ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తు కోటేశ్వరరావు మాట్లాడుతూ రోజు కూలీ రూ.600 ఇవ్వాలని, ఉపాధి హామీ చట్టం బకాయిలను వెంటనే విడుదల చేయాలని, చెరువుల పూడికతీత పనులను పునరుద్ధరించాలని, జాబ్ కార్డులను అందరికీ ఇవ్వాలని, పని స్థలం వద్దనే పే స్లిప్‌లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయ పరిపాలనాధికారి అబ్దుల్ సలాంకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ చాకిరి శివనాగరాజు, టౌన్ కార్యదర్శి షేక్ జహంగీర్ బాషా, పాపారావు, గోపాలరావు, రవీంద్ర, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

నూజివీడులో అద్వయ క్లాత్ షోరూం ప్రారంభం



మాట్లాడుతున్న ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన బ్రాండెడ్ క్లాత్ షోరూమ్‌లు చిన్న చిన్న పట్టణాల్లో కూడా ఏర్పాటు చేయడం ద్వారా నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరల్లో వినియోగదారులకు అందిస్తున్నందుకు అద్వయ క్లాత్ షోరూమ్ యాజమాన్యాన్ని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకరరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు సంయుక్తంగా అభినందించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం దగ్గరలో నూతనంగా ఏర్పాటు చేసిన అద్వయ క్లాత్ షోరూమ్‌ను దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని తరగతుల ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను, అతి తక్కువ ధరలతో వినియోగదారులకు అందించడం అభినందనీయమన్నారు. ఆధునిక సౌకర్యాలతో మూడు అంతస్తులు కలిగి కొత్త కొత్త డిజైన్లతో యువతకు మెచ్చే రీతిలో పెద్దఎత్తున స్టాకును అందుబాటులో ఉంచారన్నారు. పట్టణ ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు అన్ని రకాల, అన్ని వయసుల వారికి రెడీమేడ్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ అద్వయా షాపు ముందు ముందు నూజివీడుకు వస్త్ర ప్రపంచంలో తలమానికంగా ఉంటుందన్నారు. పండుగ సందర్భంగా ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలని యాజమాన్యాన్ని కాపా శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో షాపు నిర్వాహకులు తోటకూర వినయ్, తోటకూర అనిరుధ్, అడుసుమిల్లి చక్రి, జంధ్యాల కిరణ్ దత్తు, బొప్పన పవన్, అట్లూరి నిఖిల్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై వారంలో రెండుసార్లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుంకర బాలేందు శేఖర్ తెలిపారు. నూజివీడులో ఆయన గురువారం మాట్లాడుతూ జిల్లా రవాణా శాఖాధికారి కరీం ఆదేశాల మేరకు ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగించనున్నట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల నూజివీడు పరిసర ప్రాంతాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ప్రతి వాహన చోదకుడు గుర్తుంచుకోవాలన్నారు. అందరూ క్షేమంగా ఉండాలంటే వాహన చోదకులు ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీటు బెల్ట్ ధరించకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 18 ఏళ్లు నిండకుండా, లైసెన్సు లేకుండా వాహనం నడిపితే వాహనం నడిపిన చిన్నారులతో పాటు వాహన యజమానులు, తల్లిదండ్రులు కూడా శిక్షకు గురికాక తప్పదని హెచ్చరించారు.

రజకులకు చెరువులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

రజకులకు ప్రతి చోటా జిఒ నెంబర్ 343 ప్రకారం చెరువులు కేటాయించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎంఎల్ఎ గళ్లా మాధవిని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి కోరారు. ఈ మేరకు గుంటూరులోని వారి నివాసంలో గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రజక సామాజిక తరగతికి ప్రభుత్వం ఇచ్చిన జిఒలు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. రజకులకు 343 జిఒ ప్రకారం రజకులకు ప్రతిచోటా కచ్చితంగా చెరువు కేటాయించాలన్నారు. కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచిన రజక సామాజిక తరగతి ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని జిఒలు కచ్చితంగా అమలయ్యేలా శాసనసభలో మాట్లాడాలని కోరారు. ఈవిషయంపై స్పందించిన ఎంఎల్ఎ మాట్లాడుతూ తాను కూడా సామాన్య రజక కుటుంబం నుంచి వచ్చానని, రజకుల ఇబ్బందులు తనకు తెలుసునని, రజక సామాజిక తరగతి తరపున శాసనసభలో తన గళం వినిపించడమే కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

అంతర్గత రోడ్లు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండలంలో అధ్వానంగా ఉన్న అంతర్గత, లింకు రోడ్లు వెంటనే నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి, సిపిఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ప్రధాన రహదారులన్ని పాడైపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. టి.నరసాపురం నుంచి మక్కినవారిగూడెం, మక్కినవారిగూడెం నుంచి మర్రిగూడెం, టి.నర్సాపురం నుంచి అప్పలరాజు గూడెం రోడ్డు, టి.నర్సాపురం నుంచి బంధంచర్ల వెళ్లే రోడ్డు మధ్యాహ్నపువారిగూడెం, అప్పలరాజు గూడెం ఆర్అండ్‌బి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని పేర్కొన్నారు. రోడ్లు అబివృద్ధి చేస్తామని కొన్ని చోట్ల కంకర పోసి వదిలేసి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు రోడ్ల నిర్మాణం చేపట్టలేదని తెలిపారు. తక్షణమే టి.నర్సాపురం మండలంలో ఉన్న రోడ్లను నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - ముసునూరు

ఈ నెల ఆరో తేదీ గురువారం నుంచి వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ కె.రాజకుమార్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో రెవెన్యూ సమస్యలపై ఆయా గ్రామ సచివాలయాల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అర్జీలు తీసుకుంటారని తెలిపారు. అవకాశం ఉన్న చిన్న సమస్య అయితే అదే రోజున పరిష్కరిస్తారని చెప్పారు. ఈ రెవెన్యూ సదస్సులో తహశీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి, పలు శాఖల మండల అధికారులు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని 16 గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.